క్లుప్తంగా

కేంద్ర బలగాల కవాతు



వాడచీపురుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పారామిలటరీ దళాలు

పరవాడ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి త్వరలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో పారామిలటరీ దళాలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. పందాలు, వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సిరిపురపు సురేష్ సూచించారు. ప్రత్యేక పోలీసు బృందాలు పరవాడ, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వి. శిరీష కోరారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే నీతి కథలు చెప్పడం, చదవడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన



కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్స చేస్తున్న వైద్యులు

సింహాచలం: శ్రీకృష్ణాపురంలో రెండు రోజులుగా నిర్వహించిన సిద్ధ ఆయుర్వేద మర్మ వైద్యానికి విశేష స్పందన లభించింది. సుమారు 460 మందికి వైద్య సేవలు అందించారు. దీర్ఘ కాలంగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి, మైగ్రేన్ బాధితులకు చికిత్స చేశారు. హైదరాబాద్‌లోని శ్రీ తులసి వైద్యశాలకు చెందిన సిద్ధ వైద్యులు జగదీష్, రితిక్ కన్నా, శ్రీనాథ్, సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రకృతి వైద్యశాల వైద్యులు శ్రీదేవివర్మ సేవలు అందించారు. ప్రకృతి ఆధారిత రైతుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణవర్మ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: 11 కేవీ అప్పన్నపాలెం, శ్రీనివాస నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా శ్రీనివాసనగర్, గొల్ల లపాలెం, ప్రహ్లాదపురం, అప్పన్నపాలెం ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఎంవీపీ రైతుబజార్ సందర్శన



ఎంవీపీ రైతు బజార్‌లో మార్క్‌ఫెడ్ ప్రొడక్ట్స్ పరిశీలిస్తున్న ఎండీ శేఖర్ బాబు..

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌ను ఆదివారం మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు సందర్శించారు. రైతుబజార్‌లో భారత్ శనగ పప్పు, మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల విక్రయాలను పరిశీలించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించిన శనగపప్పు విక్రయాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఎన్ని కిలోల శనగ పప్పు విక్రయం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న మార్క్‌ఫెడ్ ఉత్పత్తుల గురించి సిబ్బంది ఆరా తీశారు. విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

రోడ్లకు మహర్దశ

- రూ.7.89 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం
- సాఫీగా సాగుతున్న ప్రయాణం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న మండల వాసులు



వెదుళ్లనరవ మీదుగా అభివృద్ధి చేసిన సబ్బవరం-దువ్వాడ రోడ్డు-2



లింగాలతిరుగుడు వరకూ విస్తరించిన సబ్బవరం-చోడవరం రోడ్డు

సబ్బవరం: మండలంలో దశాబ్దాల తరబడి కలగా మిగిలిన పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ఆ ప్రాంత వాసుల కళ్లలో ఆనందం నింపుతోంది. దీనిలో భాగంగా రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. గుంతలు, రాళ్లు తేలిన రోడ్లకు చికిత్స చేసింది. గ్రామీణ రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసింది. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ,అనకాపల్లి జిల్లాలకు సబ్బవరం ముఖద్వారంగా ఉంది. దీంతో ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేసింది. దీంతో మండలంలోని ప్రధాన రోడ్లకు మహర్దశ పట్టింది. టీడీపీ ప్రభుత్వంలో శిథిలమైన రోడ్లకు చికిత్స చేసింది. కొత్త రోడ్లు వేయడంతో పాటు విస్తరించడంతో తమ కష్టాలు తప్పాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వెదుళ్ల నరవ రోడ్డు సుందరంగా ముస్తాబైంది.

నాడు తీవ్ర నిర్లక్ష్యం

మండలంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ మారిటైం విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. అయినా గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేసింది. అలాంటి రోడ్లను నేడు ప్రభుత్వం అభివృద్ధి చేసింది.

రోడ్లు తళ తళ

సబ్బవరం-చోడవరం రోడ్డును సబ్బవరం నుంచి లింగాలతిరుగుడు వరకూ రూ.3.04 కోట్లతో అభివృద్ధి చేశారు. సుమారు 7.2 కిలోమీటర్ల రోడ్డును 7 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. విశాఖ - చోడవరం ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డు మీదగా వెళ్లే అనేక మంది సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు.

- కె. కోటపాడు-పినగాడి రోడ్డును అయ్యన్నపాలెం నుంచి పినగాడి వరకూ రూ.2.50 కోట్లతో విస్తరించారు. సుమారు 6 కిలో మీటర్ల పొడవున 7 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు వేశారు. కె. కోటపాడు నుంచి పినగాడి మీదగా విశాఖకు వెళ్లే ఈ ప్రధాన రోడ్డు అనేక మండలాలను అనుసంధానం చేస్తుంది. ఈ రోడ్డు సబ్బవరం మండలంలోని అయ్యన్నపాలెం,గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం,మొగలిపురం గ్రామాల మీదుగా వెళ్తుంది.
- సబ్బవరం-వంగలి రోడ్డును మండలంలోని గొర్లివానిపాలెం జంక్షన్ నుంచి వంగలి గ్రామం రూ.60 లక్షలతో అభివృద్ధి చేశారు. 4.5 కిలో మీటర్ల పొడవున 3.75 మీటర్లు వెడల్పుతో బీటీ రోడ్డు వేశారు. ఇది సబ్బవరం నుంచి వంగలి మీదుగా కోటపాడు రోడ్డుకు అనుసంధానించారు. ఈ రోడ్డు గొర్లివానిపాలెంతో పాటు టిక్కలిపాలెం శివారు టి. జంగాలపాలెం,నాయనమ్మపాలెం గ్రామాలను అనుసంధానం చేస్తూ వంగలి వరకూ సాగుతుంది.
- సబ్బవరం-వెంకన్నపాలెం రోడ్డును పెదగొల్లలపాలెం వరకూ రూ.1.30 కోట్లతో అభివృద్ధి చేశారు. మండలంలోని గొర్లివానిపాలెం జంక్షన్ నుంచి గొర్లివానిపాలెం,పెదనాయుడుపాలెం,అసకపల్లి మీదగా గొల్లలపాలెం వరకూ 7.05 కిలో మీటర్ల పొడవున 3.75 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. ఇది సబ్బవరం-వెంకన్నపాలెం రోడ్డు నుంచి అగనంపూడి రోడ్లను అనుసంధానం చేస్తుంది.
- నక్కవానిపాలెం మీదుగా అసకపల్లి అగనంపూడి రోడ్డును సుమారు రూ.45 లక్షలతో 1.05 కిలో మీటర్లు పొడవున 3.75 మీటర్లు వెడల్పుతో విస్తరించారు.



వెదుళ్లనరవ మీదుగా అభివృద్ధి చేసిన సబ్బవరం-దువ్వాడ రోడ్డు



సబ్బవరం నుంచి అసకపల్లి వరకూ విస్తరించిన రోడ్డు

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం



రథంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి



పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం స్వామివారు వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో రథంపై చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందించారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, మేళతాళాలతో ఊరేగింపు అత్యంత సందడిగా సాగింది. మంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహాపూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన రథోత్సవంలో ఈవో నీలిమ, ఎంఎస్ రాజు, సీఐ రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత ఆదివారం కూడా కొనసాగింది. ఈ నెల 23న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి రెండో విడతగా మూడు మణుగుల(120 కిలోలు) పచ్చి చందనం సమర్పించనున్నారు. దీనిలో భాగంగా తొలిరోజు శనివారం 40 కిలోలు చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 37 కిలోల చందనాన్ని అరగదీశారు. రెండు రోజుల్లో 77 కిలోల చందనం సమకూరింది. సోమవారం కూడా చందనం అరగదీత చేపట్టనున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్కల్ సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఉత్కల్ సమాజ్ కార్యవర్గం సభ్యులు

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సంస్కృతిక సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సిరిపురంలోని ఉత్కల్ సమాజ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జె.కె.నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.కె.పది, కార్యదర్శిగా బిమిల్ కుమార్ మహంత్, ట్రెజరర్‌గా మహేశ్వర బెహరతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు.

ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. రెండేళ్లకు ఒకసారి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కాలపరిమితి పూర్తికావడంతో పాత కార్యవర్గం ఇటీవల రద్దయింది. దీంతో అసోసియేషన్ సభ్యులు ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు అధ్యక్ష పదవికి పోటీలో నిలవడంతో ఎన్నికల పరిశీలకులుగా అల్లంపల్లి రాజబాబు, కొరికాన మోహనరావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించి పోలింగ్ చేపట్టారు. ఈ పోలింగ్‌లో అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, కోశాధికారిగా సీహెచ్.సత్యనారాయణ ఎన్నికయ్యారు. వారు ఇతర సభ్యులతో కలిసి ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవికుమార్‌ను నియమించారు. గౌరవాధ్యక్షులుగా కె.మోహనరావు, సి.సాయికుమార్, ముఖ్య సలహాదారుగా ఎ.రాజబాబు, సలహాదారుగా జి.విక్టర్, ఉపాధ్యక్షులుగా రమణ, చిన్నను నియమించారు. నూతన కార్యవర్గానికి అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు హామీ ఇచ్చారు.

బయోమెట్రిక్‌తో బాగోతం బట్టబయలు

అగనంపూడి : విశాఖ ఉక్కు కర్మాగారంలో బయోమెట్రిక్ హాజరు అమలుతో కాంట్రాక్టర్ల బాగోతం బయట పడుతోందని సమాచార హక్కు చట్టం కార్యకర్త, విశాఖ ఉక్కు కార్మిక సంఘం మాజీ నాయకుడు పట్టా రామ అప్పారావు ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్రపతి, సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయో మెట్రిక్ విధానం అమలు కాని రోజుల్లో ఒక కాంట్రాక్టర్ పేరుతో రెండు మూడు పనులకు కాంట్రాక్ట్ పొందుతూ ఒక చోట పని చేసే కార్మికుల్నే రెండు మూడు చోట్ల పని చేస్తున్నట్టు చూపించి బిల్లులు దండిగా వసూలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. బయోమెట్రిక్ అమలు చేసిన తర్వాత సుమారు ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు తక్కువగా జాబితాలో కనపడుతుందని, అయితే ఈ ఐదువేల మందిని తొలగించారా, లేక రెండు మూడింతల జాబితాతో ఉక్కు యాజమాన్యాన్ని బోల్తా కొట్టించారో వాస్తవాలు బయట పడాలంటే పది సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేసిన వారి ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి రికార్డులు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.రమేష్‌కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వైభవంగా కుంతీ మాధవ స్వామి చందనోత్సవం

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి చందనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 వరకు కుంతీ మాధవ స్వామికి అర్చక స్వాములు చందనంతో అలంకరించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం ఉదయం ఆరు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న కుంతీ మాధవ స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పించారు. వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలైన మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి, విలాస్కాన్‌పాలెం, కురుపల్లి నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, భీమునిపట్నం నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీదళార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టం పజేసి108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి



పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గనిశెట్టి సత్యనారాయణ తదితరులు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యవతి తదితరులు

పరవాడ: కమ్యూనిస్టు ముద్దు బిడ్డ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపట్టాలని, ఎత్తిన జెండా దించకుండా ప్రజల తరపున నిలబడి ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సుందరయ్య లాంటి ఆదర్శమూర్తులు నిర్మించిన పార్టీలో ఉండి మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపట్టాలన్నారు. భూమి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి పిలుపునిచ్చారు.

- పరవాడ సినిమాహాలు కూడలిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పుచ్చల పల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమాల్లో వెంకటలక్ష్మి, కుమారి, అప్పలనర్సమ్మ, కొల్లి అప్పారావు, అప్పలనాయుడు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో ...

సబ్బవరం: పుచ్చలపల్లి సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం మండల ప్రధాన కార్యాదర్శి ఉప్పాడ సత్యవతి పిలుపునిచ్చారు. మండల కేంద్రం సబ్బవరంలో సీపీఎం మొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక సంఘం నాయకులు బర్ల రమణ, పలువురు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పరీక్ష పత్రాలు



సబ్బవరంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరుస్తున్న పదోతరగతి పరీక్ష పత్రాలు

సబ్బవరం: మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్న పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 24 నుంచి ఏడు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష పేపర్లు సబ్బవరం చేరుకోవడంతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పరీక్షలకు 120 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ నిర్వహించనున్నారు. పేపర్లను భద్రపరిచిన వారిలో చీఫ్ సూపరింటెండెంట్ రొంగలి ప్రసాద్‌తో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందడి



ఉద్యానవనంలో విద్యార్థులు



ఇంట్లో పెంచుకునే మొక్కలతో విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం ఆదివారం సందడిగా కనిపించింది. ఈ పార్కును అల్లిపురంలోని యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కల విశేషాలు, ప్రత్యేకతలను పార్కు నిర్వాహకుడు డాక్టర్ మంథా శ్రీరామమూర్తి వివరించారు. వేలాది జాతులకు చెందిన మొక్కలను ఒకే చోట చూసి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పుస్తకాలలో ఉన్న మొక్కల విశేషాలను ప్రత్యక్షంగా వీక్షించి సంబరపడ్డారు. విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోగశాలగా ఈ ఉద్యానవనం నిలుస్తోందని శ్రీరామమూర్తి తెలిపారు. ఫార్మసీ, వృక్షశాస్త్రం విభాగాల విద్యార్థులు నిత్యం ఈ జీవవైవిధ్య ఉద్యానవనాన్ని సందర్శిస్తున్నారని చెప్పారు. వేసవి కాలం కావడంతో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.